రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఏలూరు స్పోర్ట్స్: రోడ్డు భద్రత నిబంధనలను అనుసరిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డిటిసి కార్యాలయంలో పట్టణంలోని ఆటో, మ్యాక్సీ, హెవీ డ్రైవింగ్ స్కూల్ డ్రైవర్లకు రహదారి భద్రతపై రవాణా శాఖ తనిఖీ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిసి షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు తప్పకుండా రహదారి భద్రతా నియమాలను పాటించిన నాడే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. మనం సక్రమంగా డ్రైవ్ చేసినప్పటికీ ఎదుటి వారివల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తుంటాయని, దానికి తగ్గట్టుగా ప్రతి డ్రైవర్ చాకచక్యంగా ప్రమాదాన్ని తప్పించగలిగే నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. క్షతగాత్రులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించిన వారికి ప్రభుత్వాలు ప్రోత్సహకాలు అందించి ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి 95 మంది డ్రైవర్లు హాజరయ్యారు. ఆర్‌టిఒ కెఎస్ఎంవి.కృష్ణారావు పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

తొలిరోజు మూతపడిన దుకాణాలు, విద్యాసంస్థలు - వివిధ రూపాల్లో నిరసన తెలిపిన గిరిజనులు

కుక్కునూరులో నిరసన తెలుపుతున్న గిరిజన యువత

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

1/70 చట్టం సవరించాలన్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ చేపట్టిన మన్యం బంద్ మొదటి రోజు మంగళవారం మండలంలో విజయవంతమైంది. ఆదివాసీ గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేతలు మండలంలో కలియతిరిగారు. వర్తక, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పెట్రోలు బంకులు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. కుక్కునూరు ప్రధాన సెంటర్లో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి శ్యామల లక్ష్మణరావు మాట్లాడుతూ విశాఖలో పారిశ్రామికవేత్తల సమావేశంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పర్యాటక రంగ అభివృద్ధికి 1/70 చట్టం ఆటంకంగా ఉందని ప్రకటించడం ఏజెన్సీలో ఆదివాసీలకు తీరని ద్రోహం చేయడమేనన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను ఆదివాసీలు తిప్పికొట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఏజెన్సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల నియామకం పూర్తిస్థాయిలో చేపట్టాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, మాస్‌లైన్ ప్రజాపంథా, సిఐటియు నేతలు మద్దతు తెలిపి ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమాలకు ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు పట్ల లక్ష్మయ్య, గిరిజన సమాఖ్య అధ్యక్షులు వర్స పాపారావు, నాయకులు వర్స నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల నాయకులు గుడెల్లి వెంకట్రావు, నాయకులు కంగాల కల్లయ్య, సోడే లక్ష్మయ్య, పీసా కమిటీ ఛైర్మన్ వర్స వెంకటేష్, కార్యదర్శి కంగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: పర్యాటక రంగ అభివృద్ధి కోసం 1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో 48 గంటలపాటు చేపట్టిన మన్యం బంద్ తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. బంద్ ప్రభావంతో మండలంలోని వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను మూయించారు. బంద్‌కు సిపిఎంతోపాటు వైసిపి, పలు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ 1/70 చట్టం సవరణ చేయాలనడం ఆదివాసీ గిరిజనులకు తీరని ద్రోహం చేయడమేనన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెంటనే గిరిజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు సరియం రామ్మోహన్, భూషణం, నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, గుడెల్లి వెంకట్రావు, కారం మల్లుదొర, రాజమ్మ, పివైఎల్ నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో..

వేలేరుపాడు రూరల్: మండలంలో 1/70 పరిరక్షణకు ఆదివాసీ గిరిజన సంఘాల జెఎసి, ప్రజాసంఘాల పిలుపులో భాగంగా మన్యం బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా వేలేరుపాడు నుండి మేడేపల్లి వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో సభ నిర్వహించారు. సభకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ అధ్యక్షత వహించారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, ఆదివాసీ మహాసభ మండల అధ్యక్షులు మొటకు రాంబాబు, జిఎస్‌పి మండల అధ్యక్షులు బంధం ప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టమున్నా ఆదివాసీల భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు చూస్తుంటే భవిష్యత్‌లో ఆదివాసీలకు రక్షణగా ఉండే చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని భావించాల్సి వస్తోందన్నారు. గిరిజనుల ఓట్లతో గెలుపొందిన పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గిరిజనేతరులకు కూడా సంక్షేమ సంఘాలు పెట్టాలని సూచించడం దారుణమన్నారు. ఆదివాసీ చట్టాల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, సిపిఎం మండల నాయకులు కారం వెంకట్రావు, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పూసం రాంబాబు, కరటం ప్రకాష్, గిరిజన సమాఖ్య నాయకులు కట్టం వెంకటేష్, కంగల గంగరాజు, జిఎస్‌పి నాయకులు మిరియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మన్యం బంద్‌లో భాగంగా తొలిరోజు మంగళవారం మండలంలో సంపూర్ణంగా సాగింది. వర్తక, వాణిజ్య సముదాయాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేశారు. బుట్టాయగూడెం బస్టాండ్ వద్ద గిరిజనులు, గిరిజన సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి 1/70 చట్టానికి సవరణ చేయాలనే అభిప్రాయం స్పీకర్‌దా, లేక ప్రభుత్వానిదా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ నాయకులు తగరం బాబురావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు పోలోజు నాగేశ్వరరావు, బన్నె వినోద్, టి.ముత్యాలమ్మ, ఉడతా వెంకటేష్, సత్యనారాయణ, సిహెచ్.దుర్గాప్రసాద్, బుల్లెమ్మ శ్రీదేవి, పోచమ్మ, వీరమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు మండలంలో మోటారు సైకిల్ ర్యాలీ

నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో అధికారులు, అభ్యర్థులు

11 నామినేషన్లు తిరస్కరణ

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి స్థానానికి 43 మంది నామినేషన్లు ఓకే

ఉపసంహరణకు 13వ తేదీ వరకూ గడువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 11 మంది అభ్యర్థుల నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. మరో 43 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలనను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పాల్గొన్నారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో ఇండిపెండెంట్లు రాయుడు శ్రీనివాసు, శెట్టిబత్తుల రాజాబాబు, భావన ధాన్యలక్ష్మి, కొండపల్లి శ్రీనివాసు, మహ్మద్ ఆలీ జామ్ షీడ్, డికెవి ప్రకాష్, కొరుసు రాజకీర్తి, మెర్ల శ్రీవాణి, జీవదేవ దయాకర్ ఖండవల్లి, నేషనల్ నవక్రాంతి పార్టీకి చెందిన పాదముత్యం ప్రతాప్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా భీమ్‌రావ్ అంబేద్కర్ పార్టీకి చెందిన నీతిపూడి రామకృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పదో తేదీన నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 54 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో 11 మంది నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో 43 మంది మిగిలారు. ఈ నెల 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సాగనుంది. అదేరోజు సాయంత్రం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లావ్యాపంగా మంగళవారం ఇంటర్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 6,274 మంది విద్యార్థులకు 6,074 మంది హాజరవ్వగా 200 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు యోహాను తెలిపారు.



వీరరాఘవులును గెలించాలని ప్రచారం చేస్తున్న ఐలు న్యాయవాదులు

పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి - తణుకు

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులును గెలిపించాలని ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ 35 సంవత్సరాలు ఉపాధ్యాయ సంఘాలతో పనిచేసి అనేక సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తిని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పనిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని, పదవుల కోసం పోటీ చేసే వ్యక్తుల కన్నా కష్టపడి పనిచేసే వ్యక్తి రాఘవులు అని ఆయనను గెలిపించాలని న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో బి.విక్టర్‌బాబు, ధనాల అప్పారావు, చింతపల్లి నాగేశ్వరరావు, ఎన్.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

60 మంది కార్మికుల రక్తదానం

ఏలూరు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఏలూరు డిపో మేనేజర్ కార్యాలయం వద్ద రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా దాదాపు 60 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డి గూడెం డిపోల నుంచి ఈ కార్మికులందరూ వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురికి ప్రాణదాతలుగా మిగులుతారన్నారు. ముఖ్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకి చేసే రక్తదానం వారి జీవితంలో మరికొన్ని రోజులు బ్రతికించేటటువంటి ఆశని చిగురింపచేస్తుందని, ఆ చిన్నారులు ఆనందంగా ఉండగలుగుతారని తెలిపారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీకి ప్రతి సంవత్సరం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రక్తదానం రోజున కేవలం వారికి మాత్రమే ఈ రక్తాన్ని అందించడం జరుగుతుందని తెలియజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ నుంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, పిఆర్‌ఒకెవి.రమణ పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఆర్థిక ఇబ్బందులు

రైలు కింద పడి వృద్ధ దంపతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉంగుటూరు, తాడేపల్లిగూడెం

వ్యాపారాల్లో వరుస నష్టాలు వారిని చుట్టుముట్టాయి. చిన్న కుమార్తె కొంత ఆర్థికంగా సాయం చేసినా వ్యాపారాల్లో వరుస నష్టాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఓపక్క అప్పులు.. మరోపక్క సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆ వృద్ధ దంపతులు అత్యంత దయనీయ పరిస్థితుల్లో మృత్యుబాట పట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ శివార్లలో 18వ వార్డు తాళ్లముదునూరుపాడుకు చెందిన తాడి వెంకట రమణారెడ్డి (62), ఆయన భార్య తాడి విమలాదేవి (52) సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై ఏలూరు జిల్లా ఉంగుటూరు చేరుకున్నారు. అక్కడ జాతీయ రహదారి పక్కనే మోటారు సైకిల్ నిలిపారు. అనంతరం వారు రైలుపట్టాల పైకి చేరుకున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వారి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. మంగళవారం ఉదయం ట్రాక్‌మ్యాన్ ఇచ్చిన సమాచారంతో సిఐ సోమరాజు, ఎస్ఐ అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోనులో నెంబర్లు ఆధారంగా ఫోన్ చేయగా మృతుల వివరాలు వెల్లడయ్యాయి. మృతుడు వెంకట రమణారెడ్డి గతంలో కలప వ్యాపారం చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో చిన్నకుమార్తె కొంత ఆర్థిక సాయం అందించింది. హోటల్ నడపగా నష్టాల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పుల పాలవ్వడం, మరోపక్క సాయం అందే పరిస్థితి లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇరువురికి వివాహాలయ్యాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

మృతులు వెంకట రమణారెడ్డి, విమలాదేవి (ఫైల్‌ఫోటోలు)



పౌల్ట్రీపై పిడుగు..!

- బర్డ్‌ఫ్లూ వైరస్‌తో లక్షల సంఖ్యలో కోళ్లు మృతి
- వేల్పూరు కృష్ణానంద పౌల్ట్రీలో కోళ్లకు ఎవిఎన్ ఇన్‌ఫ్లూ ఎంజా పాజిటివ్‌గా నిర్ధారణ
- 'పశ్చిమ'లో 17 గ్రామాలు సర్వేలైన్ జోన్‌లోకి
- ఏలూరులో 365, పశ్చిమలో 126 పౌల్ట్రీ ఫామ్‌లు
- జనాల్లో తీవ్ర ఆందోళన.. పౌల్ట్రీ రైతులకు కోలుకోలేని దెబ్బ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పౌల్ట్రీ రంగానికి ఎదురు దెబ్బ తగిలింది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటి వరకూ అందిన లెక్కల ప్రకారం పశ్చిమలో 2.50 లక్షల కోళ్లపైన, ఏలూరు జిల్లా బాదంపూడి ప్రాంతంలో లక్షా 50 వేలు కోళ్లు వరకూ చనిపోయినట్లు తెలుస్తోంది. దీంతో కోళ్లఫారాలు నడుపుతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 365 పౌల్ట్రీ ఫామ్స్ ఉండగా కోటీ 30 లక్షల కోళ్ల పెంపకం జరుగుతోంది. ప్రతిరోజూ 90 లక్షల నుంచి కోటి వరకూ గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 126 పౌల్ట్రీఫామ్స్ ఉండగా 26 లక్షల వరకూ కోళ్ల పెంపకం సాగుతోంది. 23 లక్షల వరకూ గుడ్లు ఉత్పత్తి సాగుతోంది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ అనుమానంతో 83 వరకూ శాంపిల్స్ సేకరించి ఈ నెల ఆరో తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని నేషనల్ హైసెక్యూర్టీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబోరేటరీకి పంపించినట్లు తెలిసింది. పశ్చిమగోదావరి జిల్లా వేలూర్పులోని కృష్ణానంద పౌల్ట్రీఫామ్‌లో కోళ్లకు ఎవిఎన్ ఇన్‌ఫ్లూ ఎంజా (బర్డ్‌ఫ్లూ వైరస్) ఉన్నట్లు నిర్ధారణయ్యింది. ఇది అంటువ్యాధి. అత్యధికంగా వ్యాప్తి చెందే స్వభావం దీనికి ఉంటుంది. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లలో ఉండే హెచ్5ఎన్1 జాతి వైరస్ ప్రాణాంతకమైంది. ఇది రోజుల వ్యవధిలోనే పెంపుడు పక్షులు, కోళ్లకు సోకుతుంది. పక్షుల రెట్టలు, లాలాజలం, కలుషితమైన ఆహారం, నీటిద్వారా ఇది వ్యాపిస్తుంది. కోళ్లలో బర్డ్‌ఫ్లూ వైరస్ నిర్ధారణ కావడంతో పశ్చిమ కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించి చర్యలు చేపట్టారు.

కృష్ణానందం పౌల్ట్రీ నుంచి పది కిలోమీటర్ల వరకూ అల్టర్ జోన్..

పశ్చిమగోదావరి జిల్లా తణుకు సమీపంలోని వేల్పూరులో కృష్ణానందం పౌల్ట్రీ నుంచి కిలోమీటర్ వరకూ ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తించడంతోపాటు పది కిలోమీటర్ల వరకూ సర్వేలైన్స్ జోన్ (అలర్ట్‌జోన్)గా ప్రకటించారు. కృష్ణానందం పౌల్ట్రీ నుంచి కిలోమీటర్ పరిధిలో దాదాపు ఐదు వరకూ కోళ్లఫారాలు ఉండగా వీటిలో ఉన్న కోళ్లన్నింటినీ ఆరడుగుల లోతున గోతులు తీసి పాతిపెట్టే ప్రక్రియ సాగుతోంది. మూడు నెలల వరకూ ఈ పరిధిలోని పౌల్ట్రీలు తెరవకూడదు. పది కిలోమీటర్ల మేర అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. ఈ జోన్ పరిధిలో కోళ్లు, గుడ్ల రవాణా పూర్తిగా నిషేధించారు. కోడిమాంసం అమ్మకాలు సైతం జరగకుండా ఆదేశాలు జారీఅయ్యాయి. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

ఆందోళనలో ప్రజలు..

బర్డ్‌ఫ్లూ వైరస్ కలకలంతో రెండు జిల్లాల ప్రజానీకంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కోడిగుడ్లు, కోడిమాంసం తినడంపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్న ప్రకారం ఉడికించిన గుడ్లు, వండుకున్న చికెన్ తినడం వల్ల ఇబ్బందులు ఉండవు. రెడ్‌జోన్ పరిధిలో ఉన్నవారు మాత్రం తినకూడదు. వంటకంలో వంద డిగ్రీల వేడి వరకూ ఉంటుంది. 70 డిగ్రీల వేడి తగిలితే వైరస్ చనిపోతుంది. పచ్చిగుడ్లు, మాంసం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు. 21 రోజుల వరకూ కోడిమాంసం, గుడ్లు తినకుండా ఉండటం మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తీవ్ర నష్టాల్లో పౌల్ట్రీ రైతులు..

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోళ్లు చనిపోవడం, అమ్మకాలు, కొనుగోళ్లు నిలిచిపోవడంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు కోటీ 50 లక్షల కోళ్ల పెంపకం జరుగుతోంది. వీటిపై పెట్టిన ఖర్చంతా రైతులు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి పౌల్ట్రీ రైతు రూ.కోట్లలో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోకపోతే పౌల్ట్రీ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది.

బర్డ్‌ఫ్లూకు అడ్డుకట్ట ఎలా..?

బర్డ్‌ఫ్లూ వైరస్‌ను అరికట్టేందుకు పౌల్ట్రీ రైతులు తీసుకోవాల్సిన చర్యలపై రెండు జిల్లాల పశుసంవర్ధక శాఖాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. కోళ్లు చనిపోతూ ఉంటే వెంటనే దగ్గరలోని పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఫామ్స్‌లోకి కొత్త వాళ్లను రానీయకూడదు. వైరస్ సోకిన జిల్లాల నుంచి కోళ్ల దాణా తెచ్చుకోకూడదు. ఫామ్స్ వద్ద పరిశుభ్రత పాటించాలి. అలర్డ్‌జోన్ పరిధిలోని ప్రజలు కనీసం 21 రోజుల వరకూ గుడ్లు, మాంసం వంటివి తినకపోవడం మంచిదని చెబుతున్నారు. పచ్చిమాంసం, గుడ్లు తినకూడదు.

వేల్పూరులో బర్డ్ ఫ్లూ

- ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణ
- కృష్ణానందం పౌల్ట్రీ ఫామ్ నుండి కిలోమీటర్ పరిధి ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తింపు
- కోళ్ల ఫారాలు మూడు నెలలపాటు మూసివేయాలని ఆదేశాలు
- వ్యాధి సోకిన, హెచ్చరిక జోన్ పది కిలోమీటర్ల లోపల, వెలుపల కోళ్లు, గుడ్ల రవాణా నిషేధం, చెక్‌పోస్టుల ఏర్పాటు
- చనిపోయిన కోళ్ల తొలగింపునకు 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసు వెలుగుచూసింది. వేల్పూరులోని కృష్ణానందం పౌల్ట్రీ నమూనాలను పరీక్షించగా ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణయ్యిందని, దీన్ని అరికట్టేందుకు అన్ని రకాల అత్యవసర చర్యలను చేపట్టామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం పెదఅమిరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కృష్ణానందం పౌల్ట్రీలో సోకిన ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజాపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ నాగరాణి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ కృష్ణానందం పౌల్ట్రీలో నమూనాలను పరీక్షించగా ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా పాజిటివ్‌గా నిర్ధారణైందని, కృష్ణానందం పౌల్ట్రీ ఫామ్ నుండి కిలోమీటర్ ప్రాంతాన్ని ఇన్ఫెక్షన్ జోన్‌గా గుర్తించామని, జోన్‌లో మృతి చెందిన కోళ్లు, పక్షులను తొలగించి పాతి పెట్టడానికి ఆదేశించామని తెలిపారు. ఇన్ఫెక్షన్ జోన్‌లోని కోళ్ల ఫారాలను మూడు నెలలపాటు మూసివేస్తారన్నారు. ఇన్ఫెక్షన్ జోన్ నుండి పది కిలోమీటర్ల ప్రాంతాన్ని సర్వేలెన్స్ జోన్‌గా (అలెర్ట్ జోన్) గుర్తించామన్నారు. 17 గ్రామాలు సర్వేలెన్స్ జోన్‌లో ఉన్నాయని, అవి కొమరవరం, అత్తిలి, కావలిపురం, ఎర్రాయిచెరువు, గోటేరు, మండపాక, ఇరగవరం, తేతలి, రేలంగి, గుమ్మంపాడు, పాలి, వరిగేడు, బల్లిపాడు, తణుకు, మల్లిపూడి, అర్జునుడిపాలెం గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ పరిధిలోని అన్ని చికెన్, గుడ్ల దుకాణాలు మూసివేయడానికి ఆదేశించినట్లు తెలిపారు. వ్యాధి సోకిన, హెచ్చరిక జోన్ 10 కిలోమీటర్ల లోపల, వెలుపల కోళ్లు, గుడ్ల రవాణా పూర్తిగా నిషేధించామన్నారు. నిఘా ప్రాంతంలోని అన్ని పొలాలు మూడు వారాలపాటు పరిశీలనలో ఉంటాయని తెలిపారు. వేల్పూరు బైపాస్, వేల్పూరు రైల్వే గేటు, అత్తిలి, వీరభద్రపురం, మల్లిపూడి, కొత్తపాడు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వెటర్నరీ డాక్టర్, ఇతర సిబ్బందితో కలిపి 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, వారి పరివేక్షణలో కోళ్ల తొలగింపు, పూడ్చి పెట్టే పనులు సాగుతాయని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్యం, పారవేయడం విధానాలను కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. రెడ్‌జోన్ పరిధిలో జెసిబిలు, లైమ్, బ్లీచింగ్ పౌడర్‌లను సమకూర్చాలని, పోలీసు శాఖ శాంతిభద్రతలను, కోళ్ళు, పౌల్ట్రీ ఉత్పత్తుల కదలికపై కఠినమైన నిఘా ఉంచాలన్నారు. అడవి, వలస పక్షుల మరణాలు ఆ ప్రాంతంలో ఏమైనా జరిగితే పరిశీలించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిపిఒ అరుణశ్రీ, డిఎఫ్ఒ ఆశాకిరణ్, డిఎస్ఒ బి.సరోజ, డిఎంహెచ్ఒ భాను నాయక్, రవాణా శాఖాధికారి తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇఒ

ముసునూరు : పదవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం విద్యార్థులు విజయం సాధించేలా కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి బి.సుబ్బారావు అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ చెక్కపల్లి, జిల్లా పరిషత్ హై స్కూల్ రమణక్కపేటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ప్రీ పబ్లిక్ పరీక్షలు రాసే విధానాన్ని పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు పరీక్షల్లో పాస్ అయ్యేలా చూడాలని సూచించారు. చెక్కపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి, విద్యార్థులందరికీ ఒకేసారి కూర్చోబెట్టి, మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్ : ఆర్జియుకెటి నూజివీడులో ప్రదర్శన శాఖ విభాగం మృదంగ విద్యార్థులు ఈనెల 9వ తేదీన జరిగిన మృదంగ చక్రవర్తి దండమూడి రామ్మోహన్‌రావు స్మారక ఉత్సవంలో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. వందకు పైగా మృదంగ కళాకారులతో నిర్వహించిన మృదంగాలయ విన్యాస కార్యక్రమం పద్మశ్రీ డాక్టర్ దండమూడి సుమతి రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈనెల 9న విజయవాడ దుర్గాపురంలోని శ్రీఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జియుకెటి నూజివీడు ప్రదర్శన శాఖ విద్యార్థులు పదుల సంఖ్యలో పాల్గొని అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఈ కార్యక్రమంలో మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంతటి అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డైరెక్టర్ ప్రొ. అమరేంద్ర కుమార్, ఎఒ డాక్టర్ లక్ష్మణ్, ఇతర యాజమాన్య సభ్యులు విద్యార్థులను అభినందించారు.

రేపటి నుంచి పీసా అధ్యక్ష కార్యదర్శులకు శిక్షణ

కుక్కునూరు : ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో పీసా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని, ఆ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వారికి, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచులకు, వార్డు మెంబర్లకు, వివిధ శాఖల అధికారులకు ఈనెల 13 నుండి 20 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు హై స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. పేర్కొన్నారు.

రాజశేఖరంను గెలిపించాలి : ఎంఎల్‌ఎ

చింతలపూడి : గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి ఘనవిజయం చేకూర్చడమే మన అందరి లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఏలూరు జోన్-1 ఛైర్మన్ దుస్సుదర్శ, చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడిలో మంగళవారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని కాంక్షిస్తూ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి ముత్తారెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

స్టెమీ గుండెకు భరోసా..

నూజివీడు టౌన్ : ఎవరికైనా, ఏసందర్భంలోనైనా ఛాతినొప్పి, ఇతర గుండె సంబంధిత ఇబ్బందులు ఎదురైతే తక్షణమే ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సివిల్ సర్జన్ ఇన్‌ఛార్జి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్టెమీ ప్రోగ్రాంపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆసుపత్రి ఆవరణలోని ఓపి విభాగం వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.నరేంద్ర సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ గుండె సంబంధమైన ఇబ్బందులు ఎదురైతే గోల్డెన్ అవర్‌గా చెప్పబడే మొదటి 60 నిమిషాల లోపు ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునని వివరించారు. అలాంటి సందర్భంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని హృద్రోగ వైద్యులను సంప్రదించి, వారి ఆదేశంతో నిర్ధారణ జరిగిన తర్వాత స్టెమీ అనే కార్యక్రమం ద్వారా ఇంజక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. స్టెమీ ఇంజక్షన్ ఒక్కొక్కటి రూ.45 వేలు ఖర్చు అవుతుందని, ఈ ఇంజక్షన్ పూర్తిగా ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందని వివరించారు. ఇప్పటి వరకు ఆసుపత్రి పరిధిలో 16 మందికి స్టెమీ ఇంజక్షన్లు అందించినట్లు తెలిపారు.

నేరాలు – ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : గుర్తుతెలియని కారణాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏలూరు రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రెండో పట్టణ పరిధిలోని కుమారపేట ప్రాంతానికి చెందిన కోడి సురేష్(47) స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తూ భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. భార్య కూరగాయలు అమ్ముతూ ఉండగా పెద్ద కుమార్తె ఇంజినీరింగ్ చదువుతుంది. చిన్న కుమార్తె వద్ద ఉండగా సెల్ గర్ల్‌గా పనిచేస్తుంది. ఈక్రమంలో సురేష్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఉన్నాడు. గుర్తుతెలియని కారణాలతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కూరగాయలు అమ్మడానికి ఉదయం వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకుని చూసేసరికి ఇంట్లో అతను ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని వివరాలు లభ్యం

ఏలూరు స్పోర్ట్స్ : రైలు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని రైల్వే పోలీసులు గుర్తించారు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గన్నవరం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 40 నుంచి 45 సంవత్సరాల వయసు ఉన్న గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అయితే అతని వివరాలు సోమవారం లభించలేదు. పోలీసులకు అతని వివరాలు మంగళవారం లభించాయి. మృతి చెందిన వ్యక్తి రొక్కం సూర్యనారాయణ(54)గా గుర్తించారు. అతను శ్రీకాకుళం జిల్లా గొర్లెడ్డ పురం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. గత కొంతకాలంగా స్వగ్రామం నుంచి హైదరాబాద్ ప్రాంతానికి వెళ్లి అక్కడే కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. తిరిగి హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి వెళ్లేందుకు రైలులో ప్రయాణిస్తున్న సమయంలో గన్నవరం రైల్వే స్టేషన్ సమీపానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం వారి బంధువులకు అప్పగించారు. రైల్వే ఎస్ఐ సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేతలు అరెస్ట్

చింతలపూడి : అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పంగిడిగూడెం, సుప్రీమ్ పేట గ్రామంలో దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పంగిడిగూడెం గ్రామానికి చెందిన దారావతు శిరీష్ అను మహిళ వద్ద నుంచి 10, సుప్రీమ్ పేట గ్రామానికి చెందిన యాండ్రపటి సునీత అను మహిళ వద్ద నుంచి 6 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీన పరుచుకొని, వారిరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కామవరపుకోట మండలంలోని గ్రామంలో పాత నాటు సారాయి, పులిగిన వద్ద ఒకకేసులో నిందితుడైనట్లుగా తెలిపారు. మేకా నాగేశ్వరావు, ఇద్దరు మండల ఎన్ఫోర్స్‌మెంట్ మేజిస్ట్రేట్ కామవరపుకోట వారి ఎదుట 129 బిఎన్ఎస్-ఎస్ చట్టం ప్రకారం హాజరు పరచి బైండోవర్ నమోదు చేయడమైందని తెలిపారు. నమోదు కాబడిన నాటు సారాయి పరారీ కేసులో నిందితురాలైన తనెగల మల్లెమ్మ అను మహిళను సుప్రీమ్ పేటలో మంగళవారం అదుపులో తీసుకొని, చింతలపూడి కోర్టులో హాజరు పరచడమైందని తెలిపారు. ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రతో దాడి

ముదినేపల్లి: గేదెలను మేపుకొని ఇంటికి తోలుకొని వస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి కర్రతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని దేవపుడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవపూడి గ్రామానికి చెందిన పాలడుగు నాగ వెంకట సతీష్ ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం తన గేదెలను బాడవలోకి మేపడానికి తోలుకొని వెళ్లి తిరిగి ఇంటికి తోలుకుంటూ వస్తున్నాడు. సాయిబాబా గుడి వద్దకు వచ్చేసరికి గ్రామానికి చెందిన ఉప్పులపాటి గిరిధర్ గేదెలు అతని పొలంలో మేసినట్లు భ్రమపడి గేదెలను అడ్డగించి ఆ గేదెను అతని దొడ్డిలోకి తోలుకొని వెళుచుండగా, నాగ వెంకట సతీష్ ఎందుకు నా గేదెలను అడ్డగించుచున్నావు అని అడిగినందుకు కోపంతో గిరిధర్ తన చేతిలో ఉన్న కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టగా సతీష్‌కు గాయాలయ్యాయి. విషయం తెలిసి అక్కడికి వచ్చిన సతీష్ అమ్మ, భార్యను కూడా గిరిధర్ బండభూతులు తిట్టినట్లు, గుడివాడ ఏరియా హాస్పిటల్ నుంచి వచ్చిన ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

1/70 చట్టం గిరిజనుల గుండెకాయ వంటిది

మొడియం నాగమణి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చేసిన వ్యాఖ్యలను సిపిఎంగా తీవ్రంగా ఖండిస్తున్నాము. ఎందుకంటే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు బతుకుతున్నారు అంటే గుండెకాయ లాంటి 1/70 చట్టం ఉంది కాబట్టి. అటువంటి 1/70 చట్టాన్ని సవరిస్తే కనుక గిరిజనులు ఎక్కడికి వెళ్లాలి? ఎలా బతకాలి? ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలను ఏవిధంగా సవరణ చేయాలి? ఏజెన్సీ ప్రాంతాల నుంచి గిరిజనులను ఏవిధంగా తరిమేయాలని చూస్తున్నారు. జిఒ నెంబర్ 3, పీసా కమిటీ, గ్రామసభలు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఇబ్బంది కలిగించే ఇటువంటి కార్యక్రమాలను మానుకోవాలి, లేనిపక్షంలో సిపిఎంగా గిరిజన ప్రజలకు అండగా ఉండి ఉద్యమాలు నిర్వహిస్తాం.

స్పీకర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

గిరిజన ప్రాంతం అభివృద్ధి చేయాలంటే ఈ ప్రాంతంలో పెట్టుబడులు కావాలి. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టలేరు కాబట్టి 1/70 చట్టంలో సవరణలు చేయాలని స్పీకర్ వ్యాఖ్యానించిందాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఏజెన్సీ ప్రాంతాల్లో 2006లో అడవి హక్కుల చట్టం వచ్చింది. ఇప్పటి వరకు గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదు, గిరిజన ప్రాంతంలో అక్రమంగా, అన్యాయంగా గిరిజనేతరులు భూములలో సాగులో ఉన్నారు. ఆ భూములను బయటకు తీసి గిరిజనులకు పంచవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. జిల్లాలో 57 వేల ఎకరాలు భూమి అన్యాక్రాంతం అయిందని, ఆ భూమి గిరిజనులకు సంబంధించిందని ఆనాడు రెడ్యా నాయక్ అన్నారు. స్థానిక ఎంఎల్ఎ చిర్రి బాలరాజు 1/70 చట్టాన్ని కాపాడవలసిన ప్రజా ప్రతినిధి. అలాంటిది ఆయన కూడా వీటిని ప్రోత్సహిస్తున్నాడు. గిరిజన సంఘాలు ఉన్నట్లుగానే గిరిజనేతర సంఘాలు కూడా ఏర్పాటు చేసుకోండి, మంచి నేతలకు మేము అండగా ఉంటామని అనడం ఏంటి, గిరిజన రిజర్వేషన్ల ద్వారా ఎన్నికైన చిర్రి బాలరాజు ఈవిధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఆయన గిరిజన పక్షమా? గిరిజనేతరుల పక్షమా తెలియజేయాలి. బంద్ సందర్భంగా ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సమాధానం చెప్పాలి.

గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదు

కారం రాఘవ సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి

స్పీకర్ వ్యాఖ్యలను సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీగా తీవ్రంగా ఖండిస్తున్నాం. విశాఖపట్నంలోని టూరిజంను అభివృద్ధి చేయడం కోసం 1/70 చట్టాన్ని సవరణ చేయాలి అనేది చాలా అన్యాయం. ప్రధానంగా ఏజెన్సీ గిరిజన ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం ప్రస్తుత కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వాలే, అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యల వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయం ఉంది అనేది స్పష్టం అవుతుంది. గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందకపోవడానికి, గిరిజనులు అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం గిరిజన ప్రాంతంలో రోడ్లు వేయకపోవడం, ఉన్నత స్థాయి విద్యాలయాలు నిర్మాణం చేయకపోవడం, విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందించకపోవడం వల్లనే అభివృద్ధిలో వెనుకబడ్డారు. ముందు గిరిజన ప్రాంతానికి, గిరిజనులకు అందించవలసిన వనరులను, వసతులను కల్పించాలి. అంతేకానీ ప్రస్తుతం ఉన్న గిరిజన చట్టాల జోలికి వస్తే సహించేది లేదు.

గిరిజన చట్టం 1/70ను సవరించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ చట్టాన్ని సవరిస్తే గిరిజనులకు భూమి దక్కకుండా పోతుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి బుట్టాయగూడెం గిరిజన నాయకుల మనోగతం

కూటమి ప్రభుత్వం గిరిజనులకు అనుకూలం

బొరగం శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్

కూటమి ప్రభుత్వం గిరిజనులకు అనుకూలం. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తుంది. అన్ని రకాలుగా గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేస్తుంది టిడిపి ప్రభుత్వం. గిరిజనుల అభివృద్ధికి టిడిపి, బిజెపి, జనసేనలు ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అభివృద్ధికి అనేక పథకాలుగా అమలు చేస్తుంది. జిఒ నెంబర్ 3ని కూడా అమలు చేసిన ఘనత కూడా టిడిపి ప్రభుత్వానిదే.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య : ఎడిఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ విధిగా రైతు విశిష్ట సంఖ్యను సమీపంలోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని మండవల్లి ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విశిష్ట సంఖ్య అన్ని ప్రభుత్వ పథకాలు పొందుటకు రైతులకు ఉపయోగపడుతుందని, రైతులందరూ విధిగా రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరుతో రైతులందరూ రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను కలిసి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల సర్పంచిలు బోయిన విమల రామరాజు, పరసా విశ్వేశ్వర రావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని డిఆర్‌పిఎం మీన కోరారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఆర్‌పి ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధ్యాయుల పనితీరు, పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం, రిజిష్టర్లు పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె.మహమ్మద్ ఆలీ, ఎస్ఎంసి ఛైర్మన్ కె.రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి లోన్ అమౌంట్ వేరొకరికి బదిలీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓ గ్రూప్‌కి పడాల్సిన స్త్రీ నిధి లోన్ అమౌంట్ సుమారు రూ.3 లక్షలు జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన బయటి వ్యక్తి పర్సనల్ అకౌంట్‌కి పడ్డ ఘటన జీలుగుమిల్లి వెలుగు కార్యాలయంలో కలకలం రేపుతుంది. ఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఒక్క పైసా కూడా సిబ్బంది వసూలు చేయలేదు. జీలుగుమిల్లి వెలుగు కార్యాలయంలో ఇటీవల కొన్ని డ్వాక్రా గ్రూపులకు సిబ్బంది నూతనంగా స్త్రీ నిధి లోన్‌లు చేస్తున్నారు. దీనిలో భాగంగా జీలుగుమిల్లిలోని ఓ గ్రూప్‌కి రుణ మంజూరుకి సంబంధించి దరఖాస్తులు అన్ని పూర్తి చేసి లోన్ మంజూరు చేయాలని కార్యాలయంలో అందజేశారు. అయితే సిబ్బంది తప్పిదం వల్ల అమౌంట్ కాస్త వేరే వ్యక్తి పర్సనల్ అకౌంట్‌లో పడింది. ఇది తెలియని గ్రూప్ సభ్యులు మా లోన్ అమౌంట్ ఎక్కడ అని వెలుగు కార్యాలయ సిబ్బందిని నిలదీయగా అసలు విషయం బయటకు వచ్చింది. ఆన్‌లైన్‌లో తప్పిదం వల్ల అది కాస్త బయటి వ్యక్తి అకౌంట్‌లో పడటంతో సిబ్బంది తలలు పట్టుకున్నారు. వెంటనే ఆ వ్యక్తి వివరాలు సేకరించి అతనిని అడగగా అమౌంట్ మొత్తం డ్రా చేసి సొంత అవసరాలకు వాడేసినట్లు చెబుతున్నారు. దీంతో సిబ్బంది ఆ వ్యక్తి చుట్టూ ఉరుకులు, పరుగులు పెడుతూ.. అమౌంట్ ఎలా రికవరీ చేయాలని తలలు పట్టుకుంటున్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని వెంకటాయపాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్, ఎన్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన ఐ అండ్ జనరల్ కేర్ ఎన్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు డాక్టర్ ఎస్‌కె. నాయబ్ రసూల్, కంటి చికిత్స నిపుణులు డాక్టర్ జమ్‌రుద్ షాహిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లుగా వివరించారు. ఇతర వివరాల కోసం 96403 24266 సెల్ నంబర్‌లో వైద్య సేవలు అవసరమైన పేదలు సంప్రదించవచ్చు అన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

సేవకు ఆరంభం తప్ప అంతం లేదు : ఎంఎల్‌ఎ

ఏలూరు సిటీ: సేవకి ఆరంభం తప్ప అంతం లేదని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి వ్యాఖ్యానించారు. ఏలూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎంఎల్ఎ బడేటి పుట్టినరోజును పురస్కరించుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదేక్రమంలో మంగళవారం ఏలూరు తూర్పువీధిలోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలకోన్నత పాఠశాల ఆవరణలో అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేసి, విద్యలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించారు. అమ్మానాన్నా చారిటబుల్ ట్రస్ట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. అమ్మానాన్నా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారం అను, హెచ్ఎం సిహెచ్.హరిబాబు, ట్రస్ట్ సభ్యులు సురేష్, అంబికా రఘు, వన్నాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు, రేపు త్రీ ఫేస్ విద్యుత్

చింతలపూడి : ఆడమిల్లి వద్ద గల 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 220 కేవీ లైనుకు సంబంధించి విద్యుత్ పనులు జరుగుతున్నాయని జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున 132/33 కేవీ కామవరపుకోట, చింతలపూడి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోగల టి.నరసాపురం, కామవరపుకోట, చింతలపూడి మండలాల్లోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్స్‌కి ఈనెల 12, 13 తేదీల్లో వ్యవసాయ మనకు సంబంధించి త్రీఫేస్ విద్యుత్తును ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు దశలవారీగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

బలివే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ముసునూరు : బలివే వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్వర్మణ్ రాజ్ తెలిపారు. మంగళవారం మండలంలోని బలివే గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగుతున్నాయి. కళ్యాణ ఉత్సవాల ఏర్పాట్లనుద్దేశించి ఉన్నత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తమ్మిలేరుపై నిర్మించిన బ్రిడ్జి నిర్మాణాన్ని తొలుత పరిశీలించారు. స్నాన ఘాట్ల ఏర్పాట్లు, స్త్రీలకు ప్రత్యేక స్నానపు గదులు, మహిళలకు అదనంగా ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలని, తమ్మిలేరు ప్రాజెక్టు నీళ్ల వారం రోజుల్లో ఆలయం సరిహద్దు ప్రాంతాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. డివిజన్ డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ పోలీసు బందోబస్తు నలుగురు సిఐలు, 8 మంది ఎస్ఐలు 108 మంది కానిస్టేబుళ్లు, 211 మంది ప్రయివేటు సెక్యూరిటీ గార్డ్‌ల ప్రత్యేక సిబ్బందితో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణలో స్వచ్ఛత పరిశుభ్రతలో భాగంగా ఎప్పటికప్పుడు రహదారులు, ఆలయ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని మండల అభివృద్ధి శాఖ అధికారులకు తెలియజేశారు. ఆర్‌టిసి సిబ్బందితో మాట్లాడుతూ ప్రత్యేక బస్సులు ఆ నాలుగు రోజులు ఏర్పాటు చేయటంతో పాటు, టికెట్ల ధరలు అదనంగా వసూళ్ల వసూలు చేయరాదని ఆదేశించారు. మండలంలోని మరికొన్ని గ్రామాలను కలుపుకుంటూ వెళ్లేలా బస్సులు నడపాలని తెలిపారు. ఆలయ ఉత్సవ తిరణాల్లో నాటు సారాయి, అక్రమ మద్యం అమ్మకాలు జరపరాదని, యువకులు మత్తు పానీయాలకు అలవాటు పడి చిన్నారులను, మహిళలను అసభ్య పదజాలంతో ఇబ్బందికర పరిస్థితులు తీసుకొచ్చే అవకాశం ఉన్నందున అలాంటి నిషేధం అన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రత్యేక సిబ్బందితో ఆలయంలో నాలుగు రకాలుగా క్యూ లైన్‌ల ఏర్పాట్లు చేసి భక్తులకు త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు, కళ్యాణ కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా పలు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. షాపులు, దుకాణాల వద్ద పేకాట, జూదం, గుండాట లాంటివి నిషేదించినట్లు తెలియజేశారు. తహశీల్దార్ కె.రాజకుమార్, ఎంపిడిఒ జి.రాణి, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్‌టిసి, పోలీస్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ పాల్గొన్నారు.

తమ్మిలేరు వద్ద ఘాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

98.1 శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

భీమడోలు : మండలంలో నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని భీమడోలు మండల పరిషత్ అధికారి పద్మావతి దేవి ప్రారంభించారు. మండల పరిధిలో గల రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో 98.1 శాతం పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్లు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు తెలిపారు. ఈమేరకు సంబంధిత కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఎంపిడిఒ భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ, గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ అధికారి

మళ్లీ ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు

ముదినేపల్లి : పామర్రు-దిగుమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లిలో మళ్లీ ప్రారంభమయ్యాయి. గత ఏడాది నిలిచిపోయిన పనులను అధికారులు మళ్లీ ప్రారంభించారు. ప్రస్తుతం రెండు రోజుల నుంచి ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద యంత్రాలతో పనులు జరుగుతున్నాయి. ముదినేపల్లి ఊరు వెలుపల రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి కాగా, ముదినేపల్లి ప్రధాన సెంటర్లో మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ సెంటర్లో డ్రెయిన్ల నిర్మాణం అసంపూర్తిగా చేసి మధ్యలో వదిలేశాడు. సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే వర్షపు నీరు బయటికి వెళ్లే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తుంది. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణం కారణంగా ముదినేపల్లి సెంటర్లో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆరు నెలల క్రితం నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు మళ్లీ ప్రారంభం రావడంతో ఈసారైనా పనులు పూర్తిచేస్తారనే ఆశాభావాన్ని ముదినేపల్లి గ్రామ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమే డిఇ సత్యనారాయణ వివరణ కోరగా ముదినేపల్లి సెంటర్లో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణాలు రెండు రోజుల నుంచి జరుగుతున్నాయన్నారు. మే నెలాఖరుకు సెంటర్లోనే డ్రెయినేజీ నిర్మాణాలు, కల్వర్టు నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు

O.S.No. 111/2022

బిట్వీన్:
దొంగల శ్రీరాం
S/o. దొంగల మధుసూధనరావు ...వాది
మరియు
దొంగల నిర్మల
రాచబత్తుల కళ్యాణి
నారపురెడ్డి వరలక్ష్మి ...ప్రతి వాదులు

వాది దాఖలు చేసుకున్న పబ్లికేషన్ :
పై నంబరు కల దావాలో రెండవ ప్రతివాది అయిన రాచబత్తుల కళ్యాణి (భర్త: రాచబత్తుల మధుబాబు, డోర్ నెం. 3బి-3-9/10, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు) అను వారు **తేది. 03-03-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పైన పేర్కొన్న కోర్టులో వ్యక్తిగతముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరు కావలెను. లేని యెడల పై నెంబరు దావా, మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

తూమేటి గంగరాజు
ఏలూరు అడ్వకేట్
ది.11-02-2025 ఏలూరు
సెల్: 99480 29519

ప్రకటన

మహారాజశ్రీ గౌరవ Iవ అదనపు సివిల్ జడ్జి, (జూనియర్ డివిజన్), ఏలూరు.

E.P.75/2023 in O.S.543/2019

Between:
Malla Durga Rao ...D.H.R.
and
పసుపులేటి అనుష, D/o.చక్రవర్తి,
W/o.కొండమూడి జాన్ ప్రదీప్,
D.No.3-19/1, St.Antony పబ్లిక్ స్కూల్ వద్ద,
వాణినగర్, తంగెళ్ళపూడి, ఏలూరు. ...JDR

పై నెంబరు E.P లో సేల్ నోటీసు ఆర్డరు వేసినారు కావున మీ యొక్క హాజరు నిమిత్తం ది.**3-3-2025**న పైకోర్టు నందు ఉదయం 10.30 ని॥లకు వాయిదా అయి ఉన్నది. కావున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపు కొనగలరు. కానీ ఎడల మీ పరోక్షమున పై నెంబరు E.P విచారణ జరుగునని తెలుసుకొనగలరు.

B.KUMAR,
Advocate for DHR
ఏలూరు అగ్రహారం, ఏలూరు.
ది.10-2-2024 Ph: 94938 98181.

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు

I.A.No. 930/2022

బిట్వీన్:
దొంగల శ్రీరాం
S/o. దొంగల మధుసూధనరావు ...వాది
మరియు
దొంగల నిర్మల
రాచబత్తుల కళ్యాణి
నారపురెడ్డి వరలక్ష్మి ...ప్రతి వాదులు

వాది దాఖలు చేసుకున్న పబ్లికేషన్ :
పై నంబరు కల దావాలో రెండవ ప్రతివాది అయిన రాచబత్తుల కళ్యాణి (భర్త: రాచబత్తుల మధుబాబు, డోర్ నెం. 3బి-3-9/10, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు) అను వారు **తేది. 03-03-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 గంటలకు** పైన పేర్కొన్న కోర్టులో వ్యక్తిగతముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరు కావలెను. లేని యెడల పై నెంబరు దావా, మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

తూమేటి గంగరాజు
ఏలూరు అడ్వకేట్
ది.11-02-2025 ఏలూరు
సెల్: 99480 29519

'ప్రతిరోజు వ్యాయామం చేయాలి'

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఫిజియోథెరపీతో పాటు ప్రతిరోజు వ్యాయామం కూడా చేయాలని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి, ఎంఇఒ బివిఎస్.సుబ్బారావులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఐఆర్‌టియు ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా విడుదల

కుక్కునూరు : నాడుపోచారం శివారు లచ్చిగూడెం ప్రయారిటీ గ్రామం అయినందున ఆర్ అండ్ ఆర్ కుటుంబ ప్యాకేజీ, భూమికి బదులు భూమి, ఇతర సమస్యల పరిష్కారం నిమిత్తం గ్రామంలో పిడిఎఫ్ కుటుంబాల లబ్ధిదారుల జాబితాను స్కీం అప్రూవల్‌కు చదివి వినిపించారు. ఆర్‌అండ్‌ఆర్ అధికారి, పిఒ, ఐటిడిఎ కెఆర్ పురం రాముల నాయక్ అధ్యక్షతన మండలంలోని పోచారం శివారు లచ్చిగూడెం గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పిఒ, ఐటిడిఎ అధికారి మధు భారతి, ఆర్ అండ్ ఆర్, డిటి కె.రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి : ఎంఎల్‌ఎ

ముదినేపల్లి : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి నివాసం వద్ద మంగళవారం మండలంలోని కూటమి నాయకులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో కష్టపడి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని గెలిపించాలన్నారు.

CHANGE OF NAME

CHADALAVADA MAVULU, W/o SRINU, age 38 years, R/o. D.No.18-16, Indira Nagar, Relangi, Iragavaram Mandal, 534225, West Godavari District, A.P., do hereby state as follows:

I am deponent herein I am residing in the above address. I am the Indian Passport vide issued by regonal passport office Visakhapatnam. In which in the column of name my name noted as **CHEDALAVADA MAVULU** instead of **CHADALAVADA MAVULU.**

CHANGE OF NAME

CHADALAVADA SRINU, S/o VENKATARAO, age 46 years, R/o. D.No.18-16, Indira Nagar, Relangi, Iragavaram Mandal, 534225, West Godavari District, A.P.,
do hereby state as follows:

I am deponent herein I am residing in the above address. I am the Indian Passport vide issued by regonal passport office Visakhapatnam. In which in the column of name my name noted as **CHEDALAVADA SRINU** instead of **CHADALAVADA SRINU.**

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, నరసాపురం

E.P. No. 9/2024 in O.S.No. 175/2016

బిట్వీన్:
మండ శ్రీనివాసరెడ్డి ...DHR
Vs
దాసరి వెంకట సత్యనారాయణమూర్తి
S/o. నరసింహమూర్తి, పాలకొల్లు. ...JDR

పై నెంబరు దావాలో DHR డిక్రీ బాకీ వసూలు కోరుచూ EP Sehedule Mortgaged Proparty Sale కొరకు సదరు EP దాఖలు చేసినందున, సదరు EP లో మీకు నోటీసు పంపించిననూ మీరు Notice Avoid చేయుచున్నందున మీకు ఈ ప్రకటన ద్వారా శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసి నందున మీరు **ది.21-02-2025 తేదీన ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా హాజరు కావలసియున్నది. లేనియెడల మీ పరోక్షమున సదరు EP లో అంశములో నిర్ణయించబడునని శ్రీ కోర్టు వారి ఆర్డరు పై తెలియజేయడమైనది.

K. Janardhana Reddy,
Tanuku B.Sc.,B.L, Advocate,
Dt. 11-02-2025 Tanuku
Cell: 93971 12777

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు

O.S.No. 836/2022

Between:
M/S Union Bank of India Peravali Branch, (Erst Andhra Bank) rep., by it's Manager Tanuku ...Plaintiff
And
1. Kannepamula Shyam Babu
2. Kannepamula Ratna Kumari ...Defendants

To
1. Kannepamula Shyam Babu, S/o. Krupavaram, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram, Tanuku
2. Kannepamula Ratna Kumari, W/o. Shyam Babu, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram, Tanuku Godavari District.

పై నెంబరు దావాలో వాది కోర్టు ద్వారా మీకు నోటీసును పంపించి ఉన్న మీరు తీసుకోకుండా ఎవైడ్ చేస్తున్నందున సబ్స్టిట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసు మీకు తెలియపరుచున్నందున మీరు పై నెంబరు దావా వాయిదా **ది.24-02-2025వ తేదీను ఉదయం గం. 10-30 ని.లకు** స్వయంగా గాని, లేదా మీ తరుపున అడ్వకేట్ గారి ద్వారా గాని కోర్టుకు హాజరై తమ ఆక్షేపణలు తెలియపరుచుకొనవచ్చును. లేనియెడల సదరు గౌరవ న్యాయస్థానం వారు ఏకపక్షంగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కామన మునిస్వామి
తణుకు అడ్వకేట్, తణుకు
ది. 11-02-2025 సెల్: 94414 47403